రంజాన్ వేళలు
ఇఫ్తార్ - గురువారం
సాయంత్రం - 6:34
సహర్ - శుక్రవారం
ఉదయం - 4:51



మొయినాబాద్ మండలం చిలుకూరులో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ ఉద్యోగి

గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులైన వివిధ రకాల పన్నుల వసూళ్లు జిల్లాలో ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 80శాతం పన్నులు వసూలు చేశారు. దీంతో పంచాయతీల ఖజానా నిధులతో పరిపుష్టంగా ఉంది. ఈ నిధులతో గ్రామాల్లో ప్రజావసర పనులు చేపడతారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులతో సంబంధం లేకుండా పంచాయతీలు తమ సొంతంగా పనులు చేయించుకునే వెసులుబాటు కలిగింది. గ్రామంలో తాగునీటి అవసరాలు, పారిశుధ్య నిర్వహణ, స్ట్రీట్ లైట్లు తదితర పనులకు పంచాయతీ నిధులను వెచ్చిస్తారు. జీపీలు ప్రధానంగా ఇళ్లు, దుకాణాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పన్ను వసూలు చేస్తాయి. జిల్లా వ్యాప్తంగా 558 పంచాయతీల్లో ఈ ఏట రూ.32.78కోట్ల పన్నులకు ప్రస్తుత మార్చి 26వ తేదీ వరకు 26.21కోట్ల ట్యాక్స్‌లు వసూలు చేశారు.



లక్ష్యానికి చేరువలో..

పన్నుల వసూల్!

- 116 జీపీల్లో వంద శాతం చెల్లింపులు
- తండాల్లో వెల్లివిరిసిన చెల్లింపు చైతన్యం
- పన్ను వసూళ్లకు పది రోజుల గడువు పెంపు

ఈ ఏడాది ఇప్పటికే 80శాతం కలెక్షన్

రంగారెడ్డి అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఓ వైపు నెలనెలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులకు తోడు వివిధ రకాల పన్నుల ఆదాయంతో జిల్లాలోని చాల గ్రామ పంచాయతీలు ఖజానాతో కళకళలాడుతున్నాయి. కొన్నేళ్లుగా పేరుకున్న మొండిబకాయిలను సైతం సిబ్బంది వసూలు చేస్తుండడంతో ఈ ఏడాది భారీగా నిధులు సమకూరాయి. రెండేళ్లుగా పన్నుల వసూళ్లపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇంటి పన్ను చెల్లింపుల్లో పల్లెల్లో చైతన్యం వెల్లివిరిసింది. గతేడాది కంటే 2024లో కొంత మేర పన్నుల వసూళ్లు తగ్గినా ఈ(మార్చి) నెల 26వ తేదీ వరకు 80శాతం పన్నులు వసూలయ్యాయి. నిర్దేశిత లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో పని ఒత్తిళ్లతో పన్ను వసూళ్లలో జాప్యం అవుతోంది. మార్చి ఆఖరుకల్లా మరింత పన్ను వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. వంద శాతం పన్నుల వసూలే లక్ష్యంగా మరో పది రోజులు గడువును పొడిగించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇల్లిల్లూ తిరిగి పన్ను వసూలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్వచ్ఛందంగా ప్రజలు ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. కాగా పన్ను చెల్లింపుల్లో తండాల వాసులు ముందంజలో ఉన్నారు.

జిల్లాలో రూ.26.21కోట్లు ట్యాక్స్ వసూలు

జిల్లాలోని 558 పంచాయతీల్లో గతేడాది రూ.28.93కోట్ల పనులు వసూలుకు లక్ష్యం పెట్టుకోగా రూ.27.04కోట్లు వసూలైంది. ఈ సారి జిల్లాలో ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌లు కలిపి రూ.32.78కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఈ నెల 26వ తేదీ వరకు 26.21కోట్లు వసూలు చేశారు. ఇంకా వసూలు చేయాల్సిన రూ.6.56కోట్లు మరిన్ని రోజుల్లో వసూలు చేసేందుకు పంచాయతీ అధికారులు కృషిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉంటంతో పన్ను వసూళ్లలో ఆలస్యం ఏర్పడుతోంది. వచ్చే పది రోజుల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని అధికారులు కార్యాచరణ నిర్దేశించుకున్నారు.

25-69శాతం వసూలైన జీపీలు	36
70-79శాతం వసూలైనవి	123
80-90శాతం వసూలైనవి	176
90-99శాతం వసూలైనవి	107
100శాతం వసూలైనవి	116

పన్ను చెల్లింపుల్లో తండాల చైతన్యం

వంద శాతం పన్ను చాలా వరకు తండాల్లోనే వసూలయ్యాయి. కడ్తాల, కేశంపేట, మాడ్గుల, మహేశ్వరం, తలకొండపల్లి, ఆమనగల్లు, శంషాబాద్ మండాలాల పరిధి తండాల్లో వంద శాతం పన్నులు చెల్లించారు. ఆమనగల్లు మండలం కొత్తకుంట తండా, సీతారాం నగర్ తండా, శంకర్‌కొండ తండాలో వంద శాతం పన్నులు వసూలయ్యాయి. చేవెళ్ల మండలం ఆల్లాడ, దేవుని ఎర్రవల్లి, హస్తేపూర్, కందాడ, మల్లారెడ్డిగూడ, న్యాలట, రావులపల్లి, సింగప్పగూడ, చౌదరిగూడ మండలం చింతకుంటతండా, ధర్మ్యాతండా, ఫరూక్‌నగర్ మండలం శేరిగూడ, కడ్తాల మండలం బాలాజీనగర్ తండా, గడ్డమీది తండా, గోవిందపల్లి, గోవిందపల్లితండా, మక్తమందారం, మర్రిపల్లి, నర్లకుంట తండా, న్యామతాపూర్, పల్లెచెల్కతండా, ఇడ్డమేమునిబాయి తండా, రేఖ్యతండా, వాసుదేవ్‌పూర్, కందుకూరు మండలంలో దాసరిపల్లితండా, దావుద్‌గూడ తండా, కటికెపల్లి, పెద్దమ్మతండా, కేశంపేట మండలం చౌలపల్లి, దట్టాయిపల్లె, దేవునిగుడి తండా, కోయినపల్లి, పాటిగూడ, పొల్‌కొండగుట్ట తండా, పొంపల్లి, పుట్టవోనిగూడ, సంతాపూర్, సుందాపూర్, తూర్పుగుట్ట తండాలో వంద శాతం పన్ను చెల్లించారు. కొందుర్గు మండలం లక్ష్మీదేవునిపల్లి, పాత ఆగిర్యాల, విశ్వాపూర్, మాడ్గుల మండలం అందుగ్‌ల్, అన్నెబోయినిపల్లి,అంతాపేట్, దొడ్లపహాడ్, ఫిరోజ్‌నగర్, గిరికొత్తపల్లి, గుడితండా, జాపుల తండా, జయరాంతండా, కాసిగూడెం, కాట్రగని తండా, నల్లవారిపల్లి, నర్సాయిపల్లి, పకీర్ తండా, పలుగు తండా, రాముడుగ్యాల్, సంధ్రాలగూడ తండాల్లో 100శాతం పన్ను చెల్లించారు. మహేశ్వరం మండలం డబ్బిగూడ, గంగారం, నాగిరెడ్డిపల్లి, నందుపల్లి, పెద్దమ్మతండా, రామచంద్రగుట్ట, తుమ్మకుర్తు, ఉప్పుగూడ తండా, మొయినాబాద్ మండలంలోని చందానగర్, నక్కలపల్లి, రెడ్డిపల్లి, షాబాద్ మండలంలోని అప్పారెడ్డిగూడ, బోడంపహాడ్, కేశవగూడ, లింగారెడ్డిగూడ, పెద్దవేడు, సోలిపేట్ గ్రామాల్లో పూర్తిగా పన్నులు వసూలయ్యాయి. శంషాబాద్ మండలం ఆలికొట్ల తండా, చిన్న గోల్కొండ, శంకర్‌పల్లి మండలం అంతప్పగూడ, ఇరుక్కుంటతండా, లక్ష్మారెడ్డిగూడ, తలకొండపల్లి మండలం అంతారం, బల్సుపల్లి తండా, చుక్కాపూర్, దేవుని పడ్కల్, గడ్డమీది తండా, గర్విపల్లి, జంతరెడ్డిపల్లి, కోరినకుంట తండా, లింగరావుపల్లి, మేద్యపల్లి, పాతకోట తండా, పెద్దాపూర్ తండా, వీర్నపల్లి, వెంకటరావుపేట గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలయ్యాయి. అలాగే ఆమగనల్లు మండలం చెన్నపల్లి, మేడిగడ్డతండా, చౌదరగూడ మండలం లచ్చంపేట, కడ్తాల మండలం కొండిగాని బోడుతండా, సాలపూర్, కేశంపేట మండలం చింటకుంటపల్ల, మాడ్గుల మండలం క్యాబ్య తండా, కొత్త బ్రాహ్మణపల్లి, నాగిల్ల, నర్సంపల్లి, పల్లెతండా, సుద్దపల్లి, నందిగామ మండలం బండోనిగూడ, షాబాద్ మండలం దామర్లపల్లి, శంషాబాద్ మండలం చౌదరిగూడ, తలకొండపల్లి మండలం పడ్కల్ గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో పన్నుల వసూళ్ల వివరాలు

	2022	2023	2024
పన్నుల వసూళ్ల లక్ష్యం :	రూ.26,72,82,468	28,93,66,972	32,78,15,956
వసూలైన పన్నులు :	రూ.24,22,07,458	27,04,96,052	26,21,80,576
శాతం :	98	96	80

వంద శాతం పన్ను వసూలు చేయడం లక్ష్యం



జిల్లాలో 558 పంచాయతీల్లో ఇప్పటి వరకు 80శాతం పన్ను వసూలైంది. వంద శాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ సారి వరుసగా ఎన్నికల సీజన్ నడుస్తోంది. శాసనసభ ఎన్నికలు కాగానే ఎంపీ ఎన్నికలు వచ్చేశాయి. పంచాయతీ అధికారులకు ఎన్నికల విధులు సైతం అప్పగించడంతో పన్ను వసూళ్లలో కొంత జాప్యం జరుగుతోంది. అయినా వంద శాతానికి చేరువలో ఉన్నాం. ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్లకు ప్రభుత్వం మరో పది రోజుల గడువు పెంచింది. ఆ లోగా పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటాం.

- సురేష్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి

నిధులతో గ్రామాల్లో సదుపాయాల కల్పన

గ్రామాల్లో వసూలయ్యే పన్నులను పూర్తిగా ఆ గ్రామ అవసరాలకే వినియోగిస్తారు. ఈ నిధులు ప్రభుత్వానికేమీ పోవు. పంచాయతీ ఖాతా నుంచి గ్రామంలో చేపట్టే పనులకు ఈ డబ్బును వెచ్చిస్తారు. తాగునీటి సదుపాయాలు కల్పించడం, పంచాయతీ నిర్వహణ, గ్రామంలో డ్రైనేజీ పనులు, పార్కుల నిర్వహణ, అంతర్గత రోడ్లు, పారిశుధ్య పనులు, గ్రామంలో ఏదైనా సామూహిక పండుగ నిర్వహిస్తే దానికి ఖర్చులు వంటి వాటికి నిధులను వినియోగిస్తారు. కాగా ఖర్చులన్నీ పంచాయతీల తీర్మానాల మేరకే చేపడతారు. ప్రస్తుతం పంచాయతీల పాలకవర్గాల గడువు తీరడంతో కేటాయించిన ప్రత్యేకాధికారి అనుమతితో గ్రామసభల ఆమోదంతో పనులు చేపడతారు. అలాగే రిజర్వు నిధిని మెయింటేన్ చేస్తారు. దీనిని గ్రామంలో అత్యవసరాలకు ఖర్చు చేస్తారు. పన్నులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు, ఇతర నిధులు అదనం. అలాగే పంచాయతీల్లోని కార్యదర్శి, ఈవో, జూనియర్/సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ తదితర శాశ్వత ఉద్యోగులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుంది.

మండలాల వారీగా పన్నుల వసూళ్లు ఇలా...

మండలం	జీపీలు	లక్ష్యం(రూ)	వసూలు(రూ)	శాతం
శంకర్‌పల్లి	26	3,57,87,070	2,63,65,450	74
కొందుర్గు	22	84,16,838	64,20,560	76
ఇబ్రహీంపట్నం	14	95,90,159	74,12,899	77
మంచాల్	23	56,39,379	43,41,010	77
మొయినాబాద్	28	4,57,80,658	3,51,51,720	77
అబ్దుల్లాపూర్‌మెట్టు	18	3,10,71,720	2,43,90,955	78
కందుకూరు	35	1,52,85,263	1,19,19,931	78
మహేశ్వరం	31	1,67,69,693	1,32,82,710	79
షాబాద్	41	1,03,16,994	82,44,484	80
ఫరూక్‌నగర్	47	1,90,37,076	1,53,75,211	81
కడ్తాల్	24	58,79,968	45,73,777	81
చేవెళ్ల	37	1,91,13,111	1,57,38,741	82
యాచారం	24	1,36,00,988	1,11,38,426	82
కొత్తూరు	12	73,87,636	61,01,979	83
కేశంపేట్	29	54,31,963	45,66,237	84
నందిగామ	18	3,77,58,302	3,16,50,167	84
శంషాబాద్	27	2,95,02,987	2,50,81,362	85
చౌదరిగూడెం	24	43,68,633	37,37,964	86
అమనగల్లు	13	12,17,638	11,10,617	91
మాడ్గుల	33	29,01,951	26,65,358	92
తలకొండపల్లి	32	31,57,929	29,11,018	92

రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా

విధులు నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మార్చి 27 : లోక్‌సభ ఎన్నికల్లో రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రైనర్లు ప్రతీ అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణలో వారి సందేహాలను నివృత్తి చేయాలని, అందుకు ట్రైనర్లు తీసుకుంటున్న శిక్షణలోని ప్రతీ అంశంపై పట్టు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఏ విధంగా బోధన చేస్తారో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు కూడా అలాగే వివరించాలన్నారు. పీవో, ఏపీవోలకు తప్పనిసరిగా క్యూఆర్ కోడ్‌తో హాజరు తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఈవీఎంను ఆపరేటర్ చేసేలా శిక్షనివ్వాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది ఎంత అవగాహనతో పనిచేస్తే పోలింగ్ అంత బాగా జరుగుతుందన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేటింగ్, విధులు, బాధ్యతలను ప్రిసైడింగ్ అధికారులకు వివరించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, డీఈవో సుశీందర్‌రావు, జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విధులు నిర్వహించే ప్రతొక్కరికీ పోస్టల్ బ్యాలెట్

ఎంపీ ఎన్నికల విధులను నిర్వహించే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ప్రక్రియ సమావేశాన్ని నిర్వహించారు. వారితో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేసి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనలు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు తదితరాంశాలపై దిశా, నిర్దేశం చేశారు. విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. సిబ్బందికి మొదటి విడత శిక్షణలో ఫారం-12 ఇచ్చి పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటు వేసేలా చూడాలన్నారు. ఇందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 85సంవత్సరాలకు మించిన వారికి, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. దరఖాస్తులకు అనుగుణంగా ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్వో, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఎవరి ధీమా వారిదే!

- నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- గెలుపు కోసం హోరాహోరీ పోరు
- క్యాంప్‌ల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు
- ఓటు వేయనున్న 1,439 మంది ప్రతినిధులు, 10 పోలింగ్ కేంద్రాలు
- ఏప్రిల్ 2న కౌంటింగ్

మహబూబ్‌నగర్ ప్రతినిధి/ఆమనగల్లు/కొడంగల్, మార్చి 27 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 10 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈ గెలుపు పార్టీలకు కొంత మైలేజీ ఇస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఉంది. ఈ ఎన్నిక ఆ పార్టీకి నల్లేరుపై బండినడకలా ఉండాలి. కానీ కాంగ్రెస్‌లో చాలా మంది స్థానిక ప్రజాప్రతినిధులు చేరారు. నోటిఫికేషన్ నాటికి బీఆర్ఎస్ బలం దాదాపు మూడు రెట్లు ఎక్కువ. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రకటన కాస్త ఆలస్యంయింది. ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డిని అభ్యర్థిగా పెట్టారు. అయితే కాంగ్రెస్ ముందుగానే తమ అభ్యర్థిగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డిని నిలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ నెల 6న మహబూబ్‌నగర్‌లో సభకు హాజరయ్యారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చాలామంది కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ వెంటనే తమ ప్రజాప్రతినిధులను క్యాంప్‌లకు తరలించింది. ఖర్చుకు వెనకాడకుండా గోవా, కర్ణాటకలాంటి డెస్టినేషన్లకు పంపింది. కాంగ్రెస్ కూడా క్యాంప్‌లు పెట్టింది. అభ్యర్థులు ఆర్థికంగా బలవంతులే కావడంతో కొందరికి తాయిళాలిచ్చారు. ఇద్దరు అభ్యర్థులు రెండు క్యాంపుల్లోని వారికీ కూడా డబ్బులిచ్చారు. ఉమ్మడి జిల్లాలో 10 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుంది. ప్రజాప్రతినిధులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటారు. గోవా క్యాంప్‌లోని వారితో కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వెళ్లి మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు కూడా వారి క్యాంపుల్లో పాల్గొన్నారు. గొడవలు జరగకుండా జిల్లాలో అందుబాటులో ఉన్న మొత్తం పోలీసు సిబ్బందిని బందోబస్తుకు వినియోగించనున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదనే కోపం ఉన్నందున ఆ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వస్తాయనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ క్రాస్ ఓటింగ్‌ను నమ్ముకుంది.

ఓటేయనున్న 1,439 మంది ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,439 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లో 245 మంది ఓటర్లు, కొడంగల్‌లో 56 మంది, నారాయణపేటలో 205 మంది, వనపర్తిలో 218 మంది, గద్వాలలో 225 మంది, కొల్లాపూర్‌లో 67 మంది, నాగర్‌కర్నూల్‌లో 101 మంది, అచ్చంపేటలో 79 మంది, కల్వకుర్తిలో 72 మంది, షాద్‌నగర్‌లో 171 మంది తమ ఓటు వేస్తారు. మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, షాద్‌నగర్‌లో ఎంపీడీఓ కార్యాలయాల్లో, వనపర్తిలో ఆర్డీవో కార్యాయలంలో, గద్వాలలో జడ్పీ మీటింగ్ హాల్‌లో, కొల్లాపూర్ బాలికల జూనియర్ కళాశాలలో, అచ్చంపేట బాలికల పాఠశాలలో, నాగర్‌కర్నూలులో బాలుర పాఠశాలలో, కల్వకుర్తిలో జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముగ్గురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఏప్రిల్ 2న కౌంటింగ్‌తో ఫలితం తేలనుంది. కాగా ప్రతీబూత్ వద్ద కనీసం 100 మందికి తక్కువ కాకుండా పోలీసులను పెట్టనున్నారు.



సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి

శాసన మండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డితో కలిసి పరిశీలించారు.

మండుతున్న ఎండలు

- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- రంగారెడ్డి జిల్లా మొగలిగిద్దలో 41.6 డిగ్రీలు
- రాబోయే మూడు రోజులు ఆరెంజ్ అలెర్ట్
- రాత్రివేళా పెరిగిన ఉష్ణోగ్రతలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వేసవి ఆరంభంలోనే ఎండలు దారెత్తిస్తుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొగలిగిద్దలో 41.6డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 41.2డిగ్రీలు, రెడ్డిపల్లిలో 41డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా తాండూరులో ఈ సీజన్‌లో అత్యధికంగా 40.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాకగా మర్పల్లిలో 40డిగ్రీలు, మేడ్చల్ జిల్లా అల్లాపూర్‌లో 39.5డిగ్రీలు, కుత్బుల్లాపూర్‌లో 39.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. వచ్చే మూడు రోజుల్లో రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగే ఆస్కారం ఉందని ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఏప్రిల్‌కు ముందే భానుడు భగభగమండుతుండడంతో ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతలు ప్రారంభమైయ్యాయి. మరో వైపు రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పెరగడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో చాలా మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 30 నుంచి 31 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కపోత భరించలేక ఆరుబయట నిద్రిస్తున్నారు.



మైసమ్మ హుండీ ఆదాయం రూ.9లక్షలు



కడ్తాల్, మార్చి 27 : కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. ఫౌండర్‌ట్రస్టీ రామవత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్‌ల సమక్షంలో హుండీలు లెక్కించారు. 57 రోజులకు రూ.9,03,713 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేసి ఆలయ అభివృద్ధి, భక్తుల సదుపాయాల కోసం వెచ్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, వెంకటరమణ, సంతోష్‌కుమార్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, పత్యానాయక్, కృష్ణయ్య, బీబీ చారి, శ్రీను, హర్షవర్ధన్‌రెడ్డి, బోద్య, వెంకటేశ్, కెనరా బ్యాంక్ ఉద్యోగి లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమ, మార్చి 27: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధిపై జిల్లా అదనపు డీఆర్డీవో సరోజ, ఎంపీడీవో మహేశ్‌బాబు మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. చిన్న సంఘాలు ఆర్థిక, సామాజికపరంగా ఎలా అభివృద్ధి చెందాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం సురేశ్, సెర్ప్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధిపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న డీఆర్డీవో సరోజ

మహిళాభివృద్ధే బీజేపీ లక్ష్యం



మాట్లాడుతున్న కొండా సంగీతారెడ్డి

వికారాబాద్, మార్చి 27 : మహిళలు అభివృద్ధి చెందాలన్నదే బీజేపీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ చేవెళ్ళ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి తెలిపారు. వికారాబాద్‌లోని ఓల్డ్‌గంజ్ ప్రాంతంలో ఉన్న రుద్రమదేవి సంస్థలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటే.. వారి కుటుంబం బలంగా ఉంటుందన్నారు. ప్రధాని మోదీ మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముద్రా పథకం ద్వారా మహిళలకు రుణాలు ఇస్తున్నారని తెలిపారు. వృత్తి నైపుణ్యంలో శిక్షణ కూడా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మేలు జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వికారాబాద్ శాటిలైట్ టౌన్ అనే మాట ఎన్నో ఏళ్లుగా వినిపిస్తున్న మాట అన్నారు. దీనికోసం ఇప్పటికే ప్రపోజల్ కూడా పెట్టారన్నారు. ఇది నిజం కావాలంటే అభివృద్ధి ఒకవైపు, కనెక్టివిటీ ఇంకోవైపు జరగాలన్నారు. అప్పుడు ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే ఐదో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని చెప్పారు. మహిళలు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీవో రోజా

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఆమనగల్లు , మార్చి 27 : మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ ఆమనగల్లు సీడీపీవో రోజా అన్నారు. బాలికలు, మహిళల రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాయని ఆమె చెప్పారు. పట్టణంలోని రైతు వేదికలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మాన అక్రమ రవాణా నిరోధంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి సీడీపీవో రోజా, ప్రజ్వల తెలంగాణ టీం సీనియర్ ప్యాకల్టీ సురేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వయస్సు, లింగ బేధంతో సంబంధం లేకుండా స్వలాభం కోసం పలువురు మానవులను అక్రమ రవాణ చేస్తుండడం అమానుషమన్నారు. ఇలాంటి సంఘటనలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అనిల్, అంబర్‌సింగ్, మిథాలిరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న సంగీతారెడ్డి

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి: సంగీతారెడ్డి

» ముచ్చింతల్‌లో ఇంటింటి ప్రచారం

చేవెళ్ల, మార్చి 27 : బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమని కొండా సంగీతారెడ్డి కోరారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని ముచ్చింతల్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయన గెలిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పంట రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 27 : ప్రాథమిక సహకార సంఘాల్లో తీసుకున్న పంట రుణాలను చెల్లిస్తే, రైతులు వడ్డీ రాయితీని పొందొచ్చని షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు దారమోని బక్కన్న యాదవ్ చెప్పారు.


కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బక్కన్న యాదవ్

బుధవారం షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బక్కన్న మాట్లాడుతూ రైతులకు నాలుగు కోట్ల దీర్ఘకాలిక రుణాలు, మూడు కోట్ల పంట రుణాలను ఇచ్చామని తెలిపారు. తీసుకున్న పంట రుణాలను సకాలం చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం మూడు శాతం రాయితీని ఇస్తుందని, మిగిలిన నాలుగు శాతం వడ్డీని మాత్రమే రైతులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా ఇస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు కామన్ సర్వీస్ సెంటర్‌ను బక్కన్న యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ రవికుమార్, సంఘం కార్యదర్శి రఘునందన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మురహరి, ప్రసాద్

బీజేపీకి గుణపాఠం తప్పదు

ఆమనగల్లు, మార్చి 27 : కేంద్రంలో నియంత, నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు ఎంగళి ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో పదేళ్ల అరాచక పాలన సాగించిన బీఆర్ఎస్‌కు పట్టిన గతే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తప్పదని ఆయన హెచ్చరించారు. ఐఎన్‌టీయుసీ జిల్లా కార్యవర్గ సమావేశం ఎంగళి ప్రసాద్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని ఆ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బుద్దారం మురహరి హాజరయ్యారు. కార్మికుల సంక్షేమం, ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలు, పార్టీ బలోపేతం గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా మురహరి, ప్రసాద్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో నాయకులు సాయిబాబా, సుదర్శన్, శరణ్యారెడ్డి, శ్రీనివాసులు, నర్మదారెడ్డి, సైదులు, లక్ష్మన్ నాయక్, మాధవరెడ్డి, బాలకృష్ణ, శేఖర్, కృష్ణ, పాల్గొన్నారు.



కొడంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సన్మానం

బొంరాస్‌పేట్, మార్చి 27: కొడంగల్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కోవ్వూర్ సంతోష్‌కుమార్‌ను గ్రామస్తులు సన్మానించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీనివాస్, అంజనేయు, నాగమణి, లక్ష్మి, ఆలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చిత్తరంజన్‌దాస్

ఆమనగల్లు, మార్చి 27 : మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్‌దాస్ సొంత గూటికి చేరారు. బీజేపీకి రాజీనామా చేసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణల సమక్షంలో కాంగ్రెస్ నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తలకొండపల్లి మండలం సంఘాయిపల్లి సమీపంలోని ఆ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఫామ్ హౌజ్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఈ చేరిక జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున చిత్తరంజన్ పోటీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో అభివృద్ధిని కాంక్షించి ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించారు. తన రాజీనామ పత్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపినట్లు చెప్పారు. తనకు సహకరించిన కిషన్‌రెడ్డి, బీజేపీ నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీసీ నాయకుడిగా చిత్తరంజన్ దాస్‌కు పేరుంది. 1985,1989లో రెండు పర్యాయాలు కాంగ్రెస్ తరపున ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989లో నాటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌ను ఓడించి ఆయన జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. నాటి ప్రభుత్వంలో మంత్రి గా పని చేశారు. 2004లో కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ చైర్మన్‌గా సేవలందించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనను పలువురు నాయకులు అభినందించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మిట్టపల్లి అంజయ్య, మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, పాల్గొన్నారు.


చిత్తరంజన్ దాస్‌కు కండువా కప్పుతున్న మల్లు రవి

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

చేవెళ్ల, మార్చి27 : బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, నేటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్రను చేపట్టనున్నట్లు బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లలో బీజేపీ ఏం చేసిందో ప్రజలకు తెలిపేందుకు నేటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్రను చేపట్టబోతున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజా ఆశీర్వాద యాత్ర ద్వారా ప్రతి ఒక్కరికి తెలియజేస్తామన్నారు. ఈ యాత్ర శంషాబాద్ పరిధిలోని అమ్మపల్లి ఆలయం వద్ద ప్రారంభమై ప్రతి రోజు 10గ్రామాల్లో పర్యటించే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. బీజేపీకి ఓటు వేసి మోదీని మరో సారి ప్రధానిని చేయాలని ఓటర్లను కోరారు. సమావేశంలో షైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రవియాదవ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, ప్రబాకర్‌రెడ్డి, భీమేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, వైభవ్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, రవియాదవ్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

నేడు అమ్మపల్లి నుంచి యాత్ర

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశేశ్వర్‌రెడ్డి 'చేవెళ్ల ప్రజా ఆశీర్వాద యాత్ర'ను నేడు మండల పరిధిలోని నర్కూడ అమ్మపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమాణారెడ్డి వస్తున్నారని, నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో?!

» ఆసరా కోసం ఆపన్నుల ఎదురు చూపులు

» రెండేళ్లుగా మంజూరు కానీ కొత్త పింఛన్లు

» పార్లమెంట్ ఎన్నికల తరువాతనైనా ఆశ నెరవేరేనా?



వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కొత్త పింఛన్ల కోసం ఆపన్నులు ఎదురు చూస్తున్నారు. రెండేళ్లుగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఆసరా కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత, గీత, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలతో పాటు ఏఆర్‌టీ, ఫైలేరియా, డయాలసిస్ రోగులకు కూడా ప్రభుత్వం నెల నెలా పింఛన్లు అందజేస్తూ ఆసరాగా ఉంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం అందించే ఆసరాతోనే కొందరు నిరుపేదలు ఇతరులపై ఆధారపడకుండా తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు. కొందరికి నెలవారీ పింఛన్ వస్తేనే పూట గడుస్తుంది. మరికొందరికేమో మందులు, చిల్లర సామాన్లు తెచ్చుకోవడానికి ఆసరాగా ఉంటోంది. ఇలాంటి నిరుపేదలకు అండగా ఉండేందుకు గత ప్రభుత్వం ఆసరా పేరిట పింఛన్ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే రెండేళ్లుగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఎంతో మంది ప్రభుత్వం ఇచ్చే ఆసరా కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. కొత్త పింఛన్లు రాక.. పోషించే వారు లేక కొందరు దుర్భరమైన జీవనం కొనసాగిస్తున్నారు. వృద్ధులే కాకుండా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు కూడా ఆసరా పింఛన్లకు నోచుకోక మనోవేదనకు గురవుతున్నారు. జిల్లాలో రెండేళ్ల నుంచి ఏడు వేల మందికి పైగా నిరుపేదలు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త ఆసరా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో నిరుపేదలకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఆసరా పథకం కింద జిల్లాకు మొత్తం 1,11,503 పింఛన్లు మంజూరు కాగా, నెల నెలా రూ.27,01,90,448 పింఛన్ చెల్లింపులు చేస్తున్నారు. 2022, మార్చి వరకు అర్హులైన వారికి ప్రభుత్వం ఆసరా పింఛన్లు మంజూరు చేయగా, ఆ ఏడాది ఆగస్టు నెలనుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఆ తరువాత ఆసరా కోసం దరఖాస్తు చేసుకున్న వారు కొత్త ఆసరా పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 1,11,503 మందికి ఆసరా ...

జిల్లాకు ప్రతినెలా ఆసరా పింఛన్ల రూపంలో 1,11,503 మంది లబ్ధిదారులకు రూ.27,01,90,448 ప్రభుత్వం మంజూరు చేస్తోంది. 41,982 మందికి వృద్ధాప్య పింఛన్లు, 12,703 మంది దివ్యాంగులకు, 50,092 మంది వితంతువులకు, 145 మంది చేనేత, 426 మంది గీత, 38 మంది బీడి కార్మికులకు, 4,636 మంది ఒంటరి మహిళలకు, 1,180 మంది ఏఆర్టీ, 203 ఫైలేరియా, 98మంది డయాలసిస్ రోగులకు ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందజేస్తోంది. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వితంతువులకు, చేనేత, గీత, బీడి కార్మికులు, ఏఆర్టీ, ఫైలేరియా, డయాలసిస్ రోగులకు ప్రభుత్వం నెలనెలా రూ.2,016 అందజేస్తుండగా, దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ అందజేస్తూ ఆసరా కల్పిస్తోంది.

ఎప్పుడు మంజూరు చేస్తారో...?!

జిల్లాలో కొత్తగా ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందో తెలియక దరఖాస్తుదారులు మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తుందో తెలియక ఆవేదన చెందుతున్నారు. ఆసరా కోసం దరఖాస్తు చేసుకున్న ఒకటి, రెండు నెలల్లోగా పింఛన్లు మంజూరు చేస్తే తమ కుటుంబాలను ఆదుకున్న వారవుతారని దరఖాస్తు చేసుకున్న పేదలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసరా పింఛన్ల కోసం గత ప్రభుత్వ హయాంలో కొందరు దరఖాస్తు చేసుకోగా, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక నిరుపేదలు దిగాలు పడుతున్నారు. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుపై నిర్ణయం తీసుకుని తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్‌గా ఎన్నికపత్రాన్ని అందుకుంటున్న పాండురంగారెడ్డి

ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్‌గా పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(ప్యాక్స్) చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏదుల్ల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్‌గా కంబాలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం శేరిగూడలోని సొసైటీ కార్యాలయంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి ధాత్రీదేవి ఎన్నిక నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లు ఎన్నికలో పాల్గొన్నారు. పాత చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ క్యామ శంకర్(బీఆర్ఎస్)లపై అవిశ్వాసంతో పదవి కోల్పోవడంతో ఈ ఎన్నిక నిర్వహించారు. ఫిబ్రవరి 22న అవిశ్వాసం పెట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన 11 మంది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌లకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే హైకోర్టు ఉత్తర్వులతో అప్పుడు డీసీవో ఫలితాన్ని ప్రకటించలేదు. ఈ నెల 21న కోర్టు స్టే ఎత్తివేయడంతో కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డిలకు డీసీవో ఎన్నిక పత్రాలను అందజేశారు.

రైల్వే లైన్ కోసం సర్వే

» తక్కళ్లపల్లి సమీపంలో

హద్దులు వేసిన రైల్వే అధికారులు



యాచారం, మార్చి 27: యాచారం, కందుకూరు మండలాలకు రైల్వేలైన్ రానుంది. మూడు రోజుల క్రితం రైల్వే సర్వే బృందం రైల్వే లైన్ కోసం హద్దులు గుర్తించింది. యాచారం మండలం తక్కళ్లపల్లి-మేడిపల్లిల మధ్య రోడ్డు పక్కన రైల్వే అధికారులు హద్దులు గుర్తించారు. శంషాబాద్ నుంచి నల్గొండ జిల్లా నాంపల్లి ప్రాంతాలను కలుపుతూ రైల్వేలైన్ వేసేందుకు రైల్వే అధికారులు మార్కింగ్ చేశారు. నూతన రైల్వేలైన్ కోసం రైల్వే శాఖ పూనుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరం నుంచి ఏపీలోని మాచర్ల వరకు రైల్వేలైన్ వేయాలని యూపీఏ ప్రభుత్వంలో రైల్వేశాఖ సహాయ మంత్రిగా పనిచేసిన కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి జాతీయ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. రైల్వే లైన్ కోసం అప్పట్లో కోదండరెడ్డి పలుమార్లు కేంద్ర మంత్రులకు విన్నవించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామం అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణమెప్పుడో?

కులకచర్ల, మార్చి 27: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండపై కల్యాణ మండపం నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. శ్రీ రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ప్రతీ సీజన్‌లో ఇక్కడ పెళ్లిళ్లు జరుగుతాయి. మండపం లేకపోవడంతో ఆలయ ఆవరణలోనే పెళ్లిళ్లు జరిపిస్తుంటారు. దాంతో ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అందులో రూ.10 లక్షలు ఆలయం కంట్రిబ్యూషన్ చేయగా దేవాదాయ శాఖ రూ.40 లక్షలు విడుదల చేసింది. సదరు కాంట్రాక్టర్ పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టి బిల్లు రూ.28 లక్షలు తీసుకున్నాడు. నిర్మాణ పనులు గత 8 నెలలుగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మండపం నిర్మాణం పూర్తికాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్‌తో మాట్లాడి మండపం నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన కల్యాణ మండపం


మాట్లాడుతున్న బుద్దారం మురహరి, ఎంగళి ప్రసాద్

కంటి వైద్యశిబిరం విజయవంతం

కులకచర్ల, మార్చి 27: కులకచర్ల ప్రభుత్వాసుపత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా.. 26 మందికి కంటి శుక్లాల లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి వారిని రెఫర్ చేసినట్లు తెలిపారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడంతో పాటు భోజన సదుపాయాన్ని కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, మూడు రోజులపాటు ఆసుపత్రిలో సేవలు అందించి, అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందని వైద్యాధికారిణి మాధురి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఆప్తాల్మిక్ వైద్యుడు జవహర్, వైద్యసిబ్బంది యాదమ్మ, విజయలక్ష్మి, సుజాత, జంగమ్మ, రమేశ్, శ్రీనివాస్, ప్రశాంత్, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు నర్సరీని సందర్శించిన డీఆర్డీవో

మేడ్చల్ టౌన్, మార్చి 27 : మండలంలోని పూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని డీఆర్డీవో సాంబశివరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం ముగిసేంత వరకు నర్సరీలోని మొక్కలకు సమయాను సారంగా నీరు పట్టాలని సూచించారు. అనంతరం నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. నర్సరీలో ఉన్న సమస్యలను, ఇతర ఇబ్బందులను సిబ్బందిని, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో సాంబశివరావు


పొలాలకు దారి ఇవ్వాలని ఆందోళన చేస్తున్న రైతులు

మా పొలాలకు దారి ఇవ్వండి

కీసర, మార్చి 27: వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలంటూ పలువురు రైతులు బుధవారం కీసరలో ఆందోళన చేశారు. కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 131లో అటవీ శాఖ పరిధిలో స్థలం ఉంది. ఆ స్థలం వెంట కొన్నేళ్లుగా వ్యవసాయ పొలాలకు వెళ్తున్నామని, ఉన్నట్టుండి దారిని మూసేసి, అటవీశాఖ అధికారులు ఇనుప కంచెలతో ఫెన్సింగ్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు ఫెన్సింగ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీశాఖ పరిధిలో ఉన్న భూమికి ఫెన్సింగ్ వేయాలని ఆదేశాలు వచ్చనట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుకు బడ్జెట్ కూడా కేటాయించడం జరిగిందని, రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని లక్ష్మణ్ తెలిపారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జ్యోతి

'భగీరథ' రికార్డుల పరిశీలన

మేడ్చల్ టౌన్, మార్చి 27 : గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేందుకు చేపడుతున్న చర్యలు, వాటి తాలూకు రికార్డులను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జ్యోతి పరిశీలించారు బుధవారం మండలంలోని రాజబొల్లారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ నిర్వహించారు. గ్రామంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చేపడుతున్న చర్యలు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న మంచినీటి వివరాల రికార్డులను జ్యోతి పరిశీలించారు. నీటి సరఫరా పట్ల పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేందర్, ఏఈ వసుధ, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌లు పాల్గొన్నారు.

ప్రగతి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 27: పట్టణాలు, పల్లెల ప్రగతి కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. నేడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర నాయకుడు రఘు, బ్లాక్ కాంగ్రెస్ షాద్‌నగర్ అధ్యక్షుడు జి. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడతూ బీఆర్ఎస్ పాలనలో నిధులు, విధులు లేక స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగాఏ ఉండిపోయారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడే వారిని పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు తిరిగి ఆ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఒక పారిశ్రామిక వేత్తగా ప్రజా సేవ చేస్తున్నారని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ లభిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్. నవీన్‌రెడ్డి గతంలో కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా గెలుపొంది, బీఆర్ఎస్ పార్టీలో చేరి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఎన్నికై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పట్టించుకోలేదని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూరి బస్వం, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిర్భయంగా ఓటు వేయాలి : ఎమ్మార్వో



ఓటు హక్కుపై అవగాహన కలిపిస్తున్న ఎమ్మార్వో

షాద్‌నగర్, మార్చి 27 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఓటరు నిర్భయంగా ఓటు వేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎమ్మార్వో జగదీశ్వర్ అన్నారు. బుధవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఓటు వేసే విధానంపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం స్థానిక బీఎల్వోలు, ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సీసీ రమేష్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కొందుర్గు ఇన్‌చార్జి ఏవోగా శిరీష

కొందుర్గు, మార్చి 27 : కొందుర్గు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా కేశంపేట్ ఏవోగా పనిచేస్తున్న శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన శ్రీశైలం రైతుబంధు, రైతు బీమా నిధులను దారి మళ్లించిన కేసులో ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఈ విషయమై శాఖా పరమైన విచారణ చేసిన ఉన్నతాధికారులు కొందుర్గు ఏవోగా పనిచేసిన మధుసూదన్‌ను ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇన్‌చార్జి బాధ్యతలను కేశంపేట్ ఏవో శిరీషకు ఇచ్చారు.

జాబ్ మేళాలో 65మందికి ఉద్యోగాలు


జాబ్ మేళాలో ప్రిన్సిపాల్, ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ మేళాలో పాల్గొన్నారు. వేర్‌హౌస్ సూపర్‌వైజర్, డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా 65 మంది ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు తెలిపారు.

మంచి నీటి సమస్య రాకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

చేవెళ్ల, మార్చి 27 : గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకటయ్య అన్నారు. బుధవారం శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో వారితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు ఉపాధి పనుల్లో అవకాశం కల్పించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి గీత, ఏవో సురేశ్‌బాబు, ఏఈలు చంద్రమోహన్‌రెడ్డి, యుగంధర్, డీటీ ప్రియాంక, పశువైద్యాధికారి జయసుధ, ఏపీవో నాగభూషణం, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

గూడూరు నారాయణరెడ్డి మృతి పట్ల ప్రముఖుల సంతాపం

కడ్తాల్, మార్చి 27 : డీసీసీ అధికార ప్రతినిధి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి తండ్రి గూడూరు నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మృతిచెందగా అంత్యక్రియలు కడ్తాలలో నిర్వహించారు. ఆయన భౌతికకాయాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ ఛైర్మన్ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. నారాయణరెడ్డి మృతి పట్ల ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు, పట్టణ మౌళిక సదుపాయాల ఆర్థిక సంస్థ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీలు కమ్లీమత్యానాయక్, అనితవిజయ్ సంతాపం తెలిపారు. ఆయన కుమారులు గూడూరు రవీందర్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు

- స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు , మార్చి 27: కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ఘన విజయం ఖాయమని ఆయన చెప్పారు. బుధవారం హైదరాబాద్ శివారులోని ఓ రిసార్ట్‌లో క్యాంప్‌లో ఉన్న కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో ఆయన సమావేశమయ్యారు. నేడు జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి పలు సూచనలు చేశారు. జీవన్‌రెడ్డి గెలుపును పార్టీ శ్రేణులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలిస్తే స్థానిక సంస్థల బలోపేతానికి, నిధుల సాధనకు వీలుకలుగుతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో చేసిన అబివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీలను వేదనకు గురి చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతానికి కార్యాచరణ రూపొందించి అమలు చేయడంతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఓటమి భయంతో బీఆర్ఎస్ నాయకులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, ఎంపీపీలు అనితవిజయ్, కమ్లీమోత్యానాయక్, పద్మారెడ్డి, విజయజైపాల్‌నాయక్, జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

తలకొండపల్లి, మార్చి 27 : మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకులు రామాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో గరుడ సేవ, ఎదుర్కోళ్లు, బలిహరణం, హోమం, మోహినిసేవ, పారాయణం, ప్రత్యేక పూజలు, మహాభిషేకం నిర్వహించారు. నేడు నిర్వహించబోయే స్వామి వారి కల్యాణానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు ఆదిత్య, చక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి ప్రాధాన్యం

- కాంగ్రెస్ గూటికి షాద్‌నగర్ కౌన్సిలర్, కొత్తూర్ వైస్‌ఎంపీపీ
- కండువా కప్పి ఆహ్వానించిన వీర్లపల్లి


ఎమ్మెల్యే వీర్లపల్లితో కొత్తూర్ ఎంపీపీ

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 27: కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులకు తగిన ప్రాధాన్యత ఉంటుందని వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని బీఆర్ఎస్‌కు చెందిన 5వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి, ఆమె భర్త ప్రముఖ డాక్టర్ దిలీప్‌చంద్ర బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు అభివృద్ధి కోసం తాము కాంగ్రెస్‌లో చేరినట్లు కృష్ణవేణి తెలిపారు.

కొత్తూర్ : కొత్తూర్ వైస్‌ఎంపీపీ శోభలింగం నాయక్ బుధవారం బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని ఆమె ఇంట్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగే ఒక రోజు ముందు ఆమె కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


యాచారం : మేడిపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మహేశ్వరం : ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య సేవలను పొందాలని అవేర్ సంస్థ ఛైర్మన్ మాధవన్‌జీ అన్నారు. బుధవారం తుమ్మలూరులో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ అనేక సేవా కార్యాక్రమాలను చేపడుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సహకారమందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు రాజవర్ధన్, రమాకాంత్‌శర్మ, రామయ్య, వరుణ్, తరుణ్, వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, వెంకన్నలతో పాటు గ్లోబల్, కామినేని, అంకిత్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచారం :మండలంలోని మేడిపల్లిలో బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా ఛైర్మన్ ఎస్.ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య బృందం రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులిచ్చారు. ఎంపీటీసీ ఎం.శివలీల, రమేష్, క్యాంప్ ఇన్‌చార్జి బన్నె శ్రీశైలం పాల్గొన్నారు.

చేవెళ్ల : పేద విద్యార్థులకు వైద్యం అందించడం అభినందనీయమని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచన లత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆ కళాశాలలో జనహిత సేవా సమితి నిర్వాహకులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 150 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి బ్లడ్‌గ్రూప్, హిమోగ్లోబిన్ శాతం తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్. జ్యోతి, సేవా సమితి నిర్వాహకుడు మూర్తి, అధ్యాపకులు అనురాధ, షేక్ మహబూబ్, రూప్నారవీందర్, మల్లయ్య, వైష్ణవ, సతీష్, రవీందర్, శకుంతల ,వెంకటేశ్వర్లు, వీరేశం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


మహేశ్వరం శిబిరాన్ని పరిశీలిస్తున్న మాధవన్‌జీ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచన లత

పాఠశాలకు బీరువా బహూకరణ


బీరువాను అందజేస్తున్న కృష్ణనాయక్

తలకొండపల్లి, మార్చి 27 : మండల పరిధిలోని లక్ష్మీతండా ప్రాథమిక పాఠశాలకు గిరిజన ఐక్యవేదిక కో-ఆర్డినేటర్ కొర్ర క్రిష్ణనాయక్ బీరువాను బహూకరించారు. పాఠశాల రికార్డులు, రిజిష్టర్లు భద్ర పరుచుకోవడానికి వీలుగా బీరువాను సమకూర్చి బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వామికి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, సదుపాయాల కల్పనకు దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని ఆయన పిలుపునిచ్చారు. బీరువాను బహూకరించిన కృష్ణనాయక్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మహనీయుల బాటలో పయనించాలి

మొయినాబాద్, మార్చి 27 : మహనీయుల బాటలో ప్రయానించాలని రిటైర్డ్ ఐఏఎస్ మూర్తి కే. రాజా, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్ ఎస్. రమణ కుమార్ అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన, ఆల్ ఇండియా అంబేద్కర్ యుజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు ఆధ్వర్యంలో రూపొందించిన మహాత్మా జ్యోతిరావు పూలే వందనాలు వీడియో సాంగ్ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని శాంతిచక్ర ఇంటర్నేషనల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాజ్యోతి రావు పూలే చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వీడియో సాంగ్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు, బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, తెలంగాణ ఉద్యమ కారులు దేశమోళ్ల ఆంజనేయులు, సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాల రవీందర్, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్, గాయకుడు నేర్నాల కిషోర్, ప్రమోద్‌కుమార్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు డప్పు నర్సింగ్‌రావు, ఉప్పరి శ్రీనివాస్, అప్పల రాజు, రచయిత పుట్ట శ్రీనివాస్, డైరెక్టర్ అభిషేకం, భిక్షపతియాదవ్, వినయ్‌కుమార్, శ్రీకాంత్, జనార్దన్, భాస్కర్, ప్రవీణ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

షాబాద్, మార్చి 27 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, దానితోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తల్లీ, బిడ్డకు సరిపడా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, పండ్లు, పాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, సృజన, అంగన్‌వాడీ టీచర్లు శకుంతల, విజయలక్ష్మీ, మీన, సౌభాగ్య, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రంగుల కోసం పౌల్ట్రీ రైతుల విరాళం


విరాళాలు అందజేస్తున్న పౌల్ట్రీ రైతులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 27 : షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రంగులు వేయడానికి పౌల్ట్రీ రైతులు ముందుకు వచ్చి విరాళం ఇచ్చారు. ఎంపీశేషయ్యనగర్‌కు చెందిన పౌల్ట్రీ రైతులు రూ.లక్షా ఇరవైవేలను బుధవారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు అందజేశారు. ఈ సందర్భంగా రంగులు వేయడానికి ఆర్థిక సహకారం అందించిన పౌల్ట్రీ రైతులను బక్కని నర్సింహులు అభినందించారు. ఆర్థిక సహకారం చేసిన వారిలో పాతూరి వెంకట్‌రావు, సత్యనారాయణ, రఘుపతి, జి వసంతరావు, కంకల్ శ్రీనివాసరావు, మల్లేశ్వర్‌రావు, ఎన్. శ్రీనివాసరావు, జి. శ్రీకాంత్, కె. ప్రభాకర్‌రావు, అనిల్ ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి


గోపాల్

చేవెళ్ల, మార్చి 27 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు కావలి గోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన శంకర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీలో గెలిపించాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు పని చేయలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం ఫోన్ టాపింగ్ డ్రామాలు ఆడుతుందని ఆరోపించారు.

విద్యుత్ సౌకర్యం కోసం స్థల పరిశీలన


దేవాలయం వద్ద అధికారులు, గ్రామస్థులు

కొందుర్గు, మార్చి 27 : కొందుర్గు శివారులో ఉన్న పెండ్యాల గుట్ట మీద గల శ్రీలక్ష్మీనృసింహస్వామి పాత దేవాయానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు బుధవారం విద్యుత్ ఏఈ రవికుమార్, అధికారులు స్థల పరిశీలన చేశారు. 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు నిర్మించిన ఈ పురాతన దేవాలయానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో త్వరలోనే విద్యుత్ సౌకర్యం రాబోతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులతో పాటు గ్రామస్థులు రామయ్యగౌడ్, చేవెళ్ల కృష్ణయ్య, బోజ్జిగారి అశోక్, బోయ నర్సింలు, అమర్ లింగం, ఎస్ వేణుగోపాల్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి, మార్చి 27: మార్చాల గ్రామానికిచెందిన చెదురుపల్లి కృష్ణయ్య, పంజుగుల గ్రామానికి చెందిన రమేశ్ ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల ట్రస్ట్ ఛైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. బుధవారం వారి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ట్రస్ట్ సభ్యులు కృష్ణయ్య, రమేశ్ అందజేశారు. అర్హులైన పేదలదరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను సాకారం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దారమోని గణేశ్, కిశోర్, అంజి, రమేశ్, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఈతకు వెళ్లి కూలీ మృతి


మృతదేహం

కందుకూరు, మార్చి 27: మద్యం మత్తులో బావిలో ఈతకు వెళ్లి ఓ వలస కూలీ మృతిచెందిన సంఘటన కందుకూరు మండలంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి నగరంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించిన వ్యక్తి కాంట్రాక్టర్ ఇచ్చిన విందులో మద్యం తాగి అనుకోని విధంగా మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పెద్దపాలెం గ్రామానికి చెందిన శైలద దుర్గారావు(54) కొంత కాలంగా మలక్‌పేటలో గల హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండేవాడు. వృత్తి రీత్యా సెంట్రింగ్ మేస్త్రీ పనిచేసే వాడు. కందుకూరు మండలం లేమూరు పరిధి లక్ష్మాపురం ఫార్మ్‌హౌస్‌లో సెంట్రింగ్ పనిచేశాడు. మంగళవారం సాయంత్రం కాంట్రాక్టర్ రామకృష్ణ పనివారికి ఇచ్చిన విందులో దుర్గారావు మద్యం తాగి సమీపంలో ఉన్న బావిలో ఈతకు దిగాడు. ఈ నేపథ్యంలో అతడు అతడు బావిలో మునిగి మృతిచెందినట్లు తెలిపారు. దుర్గారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దుర్గారావు కొడుకు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టు మార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

బాలుడి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్ అరెస్టు

యాచారం, మార్చి 27 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో మంగళవారం టిప్పర్ ఢీకొనడంతో లోకేష్(14) అనే బాలుడి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ఇస్మాయిల్(25)ను అదే రోజు అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా బుధవారం సాయంత్రం లోకేష్ స్వగ్రామమైన మాలగూడలో అంత్యక్రియలు జరిగాయి. అతని గ్రామంలో విషాదం నెలకొంది. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అంత్యక్రియల్లో మీర్‌ఖాన్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని సంతాపం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

శంషాబాద్ రూరల్, మార్చి 27 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం ఖాసీంపాషా(50) కొంత కాలంగా పాల్మాకులలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం ఉదయం 5.30 గంటలకు శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా ఖాసీం పాషా ఆచూకీ తెలిస్తే శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని చెప్పారు.

వ్యక్తి అదృశ్యం

శంషాబాద్‌రూరల్, మార్చి 27 : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బుధవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్దషాపూర్ తండాకు చెందిన దశరథ్ లక్ష్మి దంపతుల కుమారుడు రాజశేఖర్ గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసగా మారాడు. కాగా లక్ష్మి తన కుమారుడిని మద్యం సేవించొద్దని ఈ నెల 18న మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన రాజశేఖర్ ఇంట్లో నుంచి వెళ్లిపోయ్యాడు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం శంషాబాద్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం, మార్చి 27 : యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తమ్మలోనిగూడ గేటు సమీపంలో మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కిషన్‌పల్లికి చెందిన మహేందర్ మాల్ నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. అదే మార్గంలో అతని వెనుక వస్తున్న బాలాపూర్ మండలంలోని లెనిన్‌నగర్‌కు చెందిన కె.యాదగిరి మహేందర్ బైక్‌ను ఢీ కొట్టాడు. దాంతో రెండు బైక్‌లు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో మహేందర్, యాదగిరి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెట్రోమొబైల్-2 పోలీసులు మాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేలుళ్లకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

ఆదిభట్ల, మార్చి 27 : ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు ఉపయోగించి బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తుర్కయాంజాల్ సమీపంలో బ్రాహ్మణపల్లి రోడ్డులోని సామ రెసిడెన్సీ వెంచర్‌లో పేలుడు పదార్థాలను వినియోగించి బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్వోటీ ఎస్సైరాజు, ఆదిభట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్న అంబర్‌పేట్‌కు చెందిన కాంట్రాక్టర్ ఒరుసు వెంకటేష్, నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన సైట్ సూపర్‌వైజర్ రూపాని గణేష్, నల్గొండ జిల్లా వీఏపల్లికి చెందిన కార్మికుడు వరికుప్పల తరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పేలుడుకు వినియోగించే 35 డెటోనాటన్లు, 35 జిలటిన్ స్టిక్స్, 1 బాక్స్, కరెంట్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొలంలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరించిన వ్యక్తిపై కేసు

ఆదిభట్ల, మార్చి 27 : ఓ వ్యక్తికి చెందిన వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి చంపేస్తానంటు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదిభట్ల మున్సిపాలిటి పరిధిలోని ఎంపిపటేల్‌గూడకు చెందిన కామండ్ల శ్రీశైలం ఈనెల 25న సాయంత్రం తన వ్యవసాయ పొలంలో పనిచేసుకుంటున్నాడు. అదే సమయంలో కామండ్ల భిక్షపతి అనే వ్యక్తి శ్రీశైలం పొలంలోకి అక్రమంగా ప్రవేశించి 'నా పోలంలో బోరు బావి మోటరు పనిచేయడం లేదు. నీ మోటర్ మాత్రం ఎలా పనిచేస్తుంది. ఇది కూడా పని చేయ కూడదు' అంటూ మోటారు వైరు కత్తిరించాడు. దానికి అడ్డుపడిన శ్రీశైలంను తీవ్ర పదజాలంతో దూశిస్తూ, చంపేస్తానంటు బెదిరించాడు. బాధితుడు శ్రీశైలం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా టీపీసీసీ కార్యదర్శి జన్మదిన వేడుకలు


మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాబాద్, మార్చి 27: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మొయినాబాద్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు అలియాబాద్ మహేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.